PRGI NO:TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

తెలంగాణ | శుక్రవారం 09-10-2026 | సంపుటి: 01 | సంచిక : 271 | పేజీలు : 12

## సౌదీలో ఉద్రిక్తతలు.

రియాద్‌కు విమానాలు రద్దు చేసిన భారత సంస్థలు.
ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కీలక నిర్ణయం.
అక్టోబర్ 10 వరకు విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ప్రకటన.
టికెట్ డబ్బులు పూర్తిగా వాపస్ ఇస్తామని స్పష్టం చేసిన సంస్థలు.
సౌదీ విమానాశ్రయాలపై హౌతీల దాడుల నేపథ్యంలో ఈ పరిణామం.

2



### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే వీడియో

# వివాదం.

- షేర్ చేసిన వారిపై కేసు.
- విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించారని ఎమ్మెల్యే రంగారెడ్డిపై ఆరోపణలు.
- బస్సు మలుపు తిరుగుతుండగా పొరపాటున చేయి తగిలిందని యూత్ కాంగ్రెస్ వివరణ.
- ఇది బీఆర్ఎస్ కుట్ర అంటూ యూత్ కాంగ్రెస్ నేత పోలీసులకు ఫిర్యాదు.



**జనం వాయిస్, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 8:**

బస్సులో ఒక విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై వస్తున్న ఆరోపణలు నేపథ్యంలో, ఆ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఈ వీడియోను ప్రచారం చేస్తున్నారంటూ ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. సికిందర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అక్టోబర్ 6వ తేదీన ఔటర్ రింగ్ రోడ్డులో ప్రయాణిస్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా ఆయన ఒక కళాశాల విద్యార్థినితో మాట్లాడారు. ఈ పథకం ద్వారా తనకు ఏడాదికి సుమారు రూ. 45,000 ఆదా అవుతున్నాయని ఆమె ఎమ్మెల్యేకు వివరించారు. అయితే, ఈ సంభాషణ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే సదరు విద్యార్థినిని తాకడం - మిగతా 2 లో...

### ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు

# బీజేపీ కుట్ర

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు.
ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్.
ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు.
సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్.
ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక.



**జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 8:**

ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి - మిగతా 2 లో...

## ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా.

గ్రీన్ కార్డు ప్రక్రియ ం నిలిపివేత!
హెచ్-1బీ వీసాదారుల గ్రీన్ కార్డు ప్రక్రియపై ట్రంప్ సర్కార్ కీలక నిర్ణయం.
మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి భారత ఐటీ కంపెనీల సస్పెన్షన్.



2

### జూరాల నీళ్లు వదిలిన

# రైతులపై కేసులు.



14 మందిపై కేసు నమోదు
వనపర్తి జిల్లాలో 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు.
జూరాల కాలువకు బలవంతంగా నీళ్లు విడుదల చేయడమే ఇందుకు కారణం.
పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు.
ఇరిగేషన్ డీఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్పై వెల్లడి.
నీటి కోసం ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు.

2

# పెరిగిన ఆర్టీసీ ఎన్నికల వేడి

- మూడు కూటముల మధ్య హోరాహోరీ పోరు.
- 39 వేల మందికి పైగా కార్మికుల ఓటు.
- 40 డిమాండ్లతో సంఘాల మేనిఫెస్టోలు.
- రాజకీయ పార్టీలకు పరీక్షగా మారిన ఎన్నికలు.

2




### జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై

## సీపీ సజ్జనార్ ఆగ్రహం.



తన ఫోటోను మార్ఫ్ ం చేశారంటూ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌పై సజ్జనార్ అసంతృప్తి.
సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటో ఏఐ సృష్టించిన ఫేక్ అని స్పష్టీకరణ.
ఈ విషయాన్ని గమనించాలంటూ నటుడు ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేసిన వైనం.

2

### తెలంగాణలో మండుతున్న

## ఎండలు.

పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత.
ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు.

2



## రైతులకు బేడీలా?



కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం.
జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు.
ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు.
ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు.
రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్.
లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక.

2

### నాపై పోటీ చేసి

## గెలువు

ఖైరతాబాద్ బరిలో దిగాలని కేటీఆర్‌కు దానం నాగేందర్ సవాల్.
ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం అని వ్యాఖ్య.



2

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# సౌదీలో ఉద్రిక్తతలు.

**జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 8:**

సౌదీ అరేబియాలో నెలకొన్న తీవ్ర భద్రతాపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయ విమానయాన సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్.. సౌదీ రాజధాని రియాద్‌కు నడిపే తమ విమాన సర్వీసులను అక్టోబర్ 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు గురువారం ప్రకటించాయి. ఈ మార్గంలో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తిస్థాయిలో నగదు వాపసు (రిఫండ్) ఇవ్వనున్నట్లు లేదా అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారులు గత కొద్దిరోజులుగా సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, సైనిక స్థావరాలు, చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో, సౌదీ గగనతలాన్ని తమ సైనిక కార్యకలాపాలకు వేదికగా మార్చుకున్నామని, అందువల్ల అంతర్జాతీయ విమానయాన సంస్థల విమానాలు ఈ మార్గంలో ప్రయాణించవద్దని హౌతీలు గురువారం ఉదయం చివరి హెచ్చరిక జారీ చేశారు. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించాయి. బుధవారం రియాద్, అభా విమానాశ్రయాలపై హౌతీ తిరుగుబాటుదారులు జరిపిన దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించినట్లు సౌదీ అధికారులు ధ్రువీకరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు కీలక సూచనలు చేశారు. విమానాశ్రయానికి వచ్చే ముందు తమ విమాన ప్రయాణ స్థితిగతులను తెలుసుకోవడానికి నేరుగా సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. "ఈ ప్రాంతంలో వేగంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా, అక్టోబర్ 10 వరకు రియాద్‌కు విమాన సర్వీసులను రద్దు చేశాం. దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులకు ఉచిత రీషెడ్యూలింగ్ లేదా పూర్తి రిఫండ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం" అని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. తాజా పరిణామాలతో రియాద్ వెళ్లే ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు.

**జనం వాయిస్, వనపర్తి, అక్టోబర్ 8:**

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయన్న ఆవేదనతో, జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో, గత నెల సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం వారే నేరుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21వ తేదీన జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**

తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# ఐటీ దిగ్గజ కంపెనీలపై అమెరికా కొరడా.

**జనం వాయిస్, ఢిల్లీ, అక్టోబర్ 8:**

అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డు) కల్పించే ప్రక్రియలో కీలకమైన 'శాశ్వత కార్మిక ధ్రువీకరణ (పెర్మ్)' కార్యక్రమం నుంచి మైక్రోసాఫ్ట్, అడోబ్‌తో పాటు పలు భారత ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా కార్మిక శాఖ ఇకపై ఈ కంపెనీల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులను స్వీకరించదు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించదు. అయితే, ఈ చర్యల ప్రభావం ప్రస్తుత హెచ్-1బీ వీసాలపై ఉండదని, కేవలం గ్రీన్ కార్డు మంజూరు ప్రక్రియపైనే ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కంపెనీలలో పనిచేస్తున్న విదేశీయులు గ్రీన్ కార్డు పొందడం ఇకపై దాదాపు అసాధ్యంగా మారనుంది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, ముఖ్యంగా మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "అమెరికాలో ఈ వ్యవస్థను మైక్రోసాఫ్ట్ కంటే ఎక్కువగా ఎవరూ దుర్వినియోగం చేయలేదు. ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించి, దాదాపు 6,300 హెచ్-1బీ వీసాలు, 3,000 గ్రీన్ కార్డులు పొందింది. ఇది అమెరికన్ల స్థానంలో విదేశీ బానిసలను నియమించుకోవడమే" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్‌లింగ్ మాట్లాడుతూ, 2009 నుంచి ఈ కంపెనీలు దాదాపు 30 లక్షల మంది విదేశీ కార్మికుల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 2,30,000 హెచ్-1బీ వీసాలు, లక్షకు పైగా పెర్మ్ సర్టిఫికేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సంస్థలు మోసాలకు పాల్పడుతూ, తక్కువ వేతనాలకు విదేశీయులను నియమించుకుని అమెరికన్ల ఉద్యోగాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సబ్‌పోనలు జారీ చేశామని, పలు ఫెడరల్ ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్నాయని వెల్లడించారు. మరోవైపు, విద్యార్థి వీసాల దుర్వినియోగం ఆరోపణలపై హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫోర్డ్ సహా తొమ్మిది విశ్వవిద్యాలయాలపై కూడా ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించినట్లు ప్రకటించారు.

**ఏమిటీ పెర్మ్ ప్రోగ్రాం?**

అమెరికాలో ఒక విదేశీ ఉద్యోగికి గ్రీన్ కార్డు స్పాన్సర్ చేయాలంటే, సదరు ఉద్యోగానికి తగిన నైపుణ్యం, అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ అందుబాటులో లేరని యజమాని నిరూపించాలి. దీనికోసం చేపట్టే ప్రక్రియే పెర్మ్. ఇది ఆమోదం పొందాకే గ్రీన్ కార్డు కోసం తదుపరి దశ అయిన I-140 పిటిషన్‌ను దాఖలు చేయడానికి వీలవుతుంది. తాజా సస్పెన్షన్‌తో ఈ కంపెనీలకు ఆ మార్గం మూసుకుపోయింది. ఈ నిషేధం ఎప్పటివరకు కొనసాగుతుందనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

# పెరిగిన ఆర్టీసీ ఎన్నికల వేడి

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతున్న ఈ ఎన్నికలు కార్మిక సంఘాలకే కాకుండా రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సుమారు 39 వేల మందికి పైగా ఆర్టీసీ కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండటంతో ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.




**మూడు కూటముల మధ్య పోరు**

ఈసారి పలు కార్మిక సంఘాలు కూటములుగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో తెలంగాణ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఒక కూటమిగా పోటీ చేస్తున్నాయి. టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ కలిసి జేఏసీగా బరిలోకి దిగాయి. తెలంగాణ జాయింట్ మజ్దూర్ యూనియన్, బహుజన్ వర్కర్స్ యూనియన్ తదితర సంఘాలు మరో కూటమిగా పోటీ చేస్తున్నాయి.

**కార్మిక సమస్యలే ప్రధాన అజెండా**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మిక సంఘాలు మేనిఫెస్టోలు, డిమాండ్ల పత్రాలను విడుదల చేస్తున్నాయి. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ అమలు, 2025 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన వేతన సవరణ బకాయిల చెల్లింపు, 2017, 2021 బకాయిలను విడుదల చేయడం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ప్రావిడెంట్ ఫండ్ బకాయిల పరిష్కారం, కొత్త బస్సుల కొనుగోలు, డిపోల అభివృద్ధి వంటి హామీలను కూడా కార్మికుల ముందు ఉంచుతున్నాయి.

**రాజకీయ పార్టీలకు పరీక్ష**

ఆర్టీసీ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రభావం కనిపిస్తుండటంతో ఇవి కేవలం కార్మిక సంఘాల ఎన్నికలుగా కాకుండా రాజకీయ పోరుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ మద్దతుతో కొన్ని సంఘాలు, ప్రతిపక్షాల అండతో మరికొన్ని సంఘాలు కార్మికులను ఆకట్టుకునేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. డిపోల వారీగా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాయి.

**అక్టోబర్ 9న బ్యాలెట్ తీర్పు**

ఈ ఎన్నికల ఫలితాలు ఏ సంఘానికి గుర్తింపు లభిస్తుందనే అంశంతో పాటు ఆర్టీసీ కార్మికుల్లో ఏ రాజకీయ శక్తికి ఆదరణ ఉందనే దానిపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో జరిగిన సమ్మెలు, ఆందోళనలు, ప్రభుత్వంతో జరిగిన చర్చలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన హామీలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి. కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు రాజకీయ ఆధిపత్య పోరుగా మారిన ఈ ఎన్నికల్లో అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మికులు ఎవరికి పట్టం కడతారన్నది ఉత్కంఠగా మారింది.

# ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే వీడియో వివాదం.

- మొదటి పేజీ తరువాయి..

వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవ్వడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మాత్రమే ఎమ్మెల్యే చేయి ఆ యువతికి తగిలిందని, కానీ బీఆర్ఎస్ నాయకులు దీనిని ఉద్దేశపూర్వకంగా తప్పుడు కోణంలో చిత్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ కుట్ర పన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సికిందర్ రెడ్డి ఫిర్యాదు ఆధారంగా, పరువు నష్టం కలిగించే ఉద్దేశంతో దుష్ప్రచారం చేయడం, ఫోర్జరీ, పబ్లిక్ మిస్చీఫ్ వంటి అభియోగాలతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67 కింద వీడియోను షేర్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం. ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు. వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని,



అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర

- మొదటి పేజీ తరువాయి..



బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# రైతులకు బేడీలా?

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**



పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ ది గ జా ర ం డ ం త నా ని కి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. "ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# నాపై పోటీ చేసి గెలువు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**



ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్' అని ధీమా వ్యక్తం చేసిన ఆయన, ఈ ఉప ఎన్నిక తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఒక రెఫరెండంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ఆ అధికారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలోనే జరగనున్న ఉప ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం ధీమా వ్యక్తం చేశారు.

PRGI NO:TGTEL/26/A0383
దైనిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# మేజిక్ రాజాకు జాతీయ అవార్డు

- 'బెస్ట్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్'గా సన్మానం.
- తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం.
- మానసిక వికాసంపై విద్యార్థులకు ప్రేరణాత్మక కార్యక్రమాలు.
- బహుముఖ కళాకారుడిగా మేజిక్ రాజా సేవలు.




**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 8:**

స్థానిక ప్రముఖ ఇంద్రజాలికుడు, ప్రేరణాత్మక వక్త మేజిక్ రాజాకు జాతీయస్థాయి అవార్డు లభించింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో డాక్టర్ బీవీ పట్టాభిరామ్ స్మారక జాతీయ అవార్డులు--2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేజిక్ రాజాను తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, కార్యక్రమ ముఖ్య సమన్వయకర్త, ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ ఎంఏ కరీం ఘనంగా సన్మానించి 'బెస్ట్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్' జాతీయ అవార్డును అందజేశారు. మేజిక్ రాజా ఇంద్రజాలికుడిగానే కాకుండా మిమిక్రీ, మూకాభినయం, వెంట్రిలాక్విజం కళాకారుడిగా, నటుడిగా, వ్యాఖ్యాతగా, పాత్రికేయుడిగా, వార్తా పఠనకుడిగా, ప్రేరణాత్మక వక్తగా బహుముఖ ప్రతిభను చాటుతున్నారు. నాడీ భాషా కార్యక్రమం, జీవన విద్యలో శిక్షణ పొందిన ఆయన పలు పాఠశాలల్లో విద్యార్థులకు జ్ఞాపకశక్తి పద్ధతులు, పఠన నైపుణ్యాలు, సానుకూల ఆలోచన, లక్ష్య సాధన వంటి అంశాలపై ప్రేరణాత్మక ప్రసంగాలు అందిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు వేదికలపై వ్యాఖ్యాతగా, కళాకారుడిగా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన తమ సంఘం ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డాక్టర్ ఎంఏ కరీం తెలిపారు. కార్యక్రమం అనంతరం మేజిక్ రాజా ప్రదర్శించిన 'మాట్లాడే బొమ్మ' ప్రత్యేక ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రా ముఖర్జీ, డాక్టర్ జీ. రాజేశ్వర్‌రావు, డాక్టర్ టి. అంజనామూర్తి, డాక్టర్ రాహతుల్లా, డాక్టర్ గర్రె శంకర్‌రావు, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ అనితాజ్యోతి, డాక్టర్ ఆజం అలీ, డాక్టర్ భాగ్యవతి, సీనియర్ ఇంద్రజాలికులు ఎన్ఆర్ కరెంట్, మధుబాల, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు. మేజిక్ రాజా జాతీయస్థాయి అవార్డు అందుకోవడం పట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# బోయిన్‌పేట్‌లో విద్యుత్ పనులు ప్రారంభం

**ప్రజా సమస్య పరిష్కారానికి సహకరించిన మంత్రి, అధికారులకు కౌన్సిలర్ శ్రీలత క్రాంతి కృతజ్ఞతలు.**

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 8:**





బోయిన్‌పేట్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించి విద్యుత్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పనులతో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కానున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ పనులు ప్రారంభం కావడానికి సహకరించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మంథని విద్యుత్ శాఖ సహాయ విభాగ ఇంజినీర్ వెంకటనారాయణ, సహాయ ఇంజినీర్ సాయి, విద్యుత్ శాఖ సిబ్బందికి బోయిన్‌పేట్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బోయిన్‌పేట్ 6వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. విద్యుత్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# విషాల్ మార్ట్ వద్ద పార్కింగ్ సమస్య

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**
**రోడ్డుపైనే వాహనాల నిలుపుదల..**
**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.**
**హెచ్చరికలు చేసినా మారని పరిస్థితి..**
**అధికారుల పర్యవేక్షణ ఏది?**
**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం.. శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**




**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 8:**

రాజీవ్ రహదారికి సమీపంలోని విషాల్ మెగా మార్ట్ వద్ద పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వాహనాలను క్రమబద్ధంగా నిలిపేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో కొందరు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తుండటంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. రెండు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో ట్రాఫిక్ సీఐ, ఏసీపీ వాహనదారులను నిలిపి నిబంధనలు పాటించాలని, తప్పుదిశలో వాహనాలు నడపవద్దని సూచించారు. అధికారులు స్వయంగా అక్కడ పరిస్థితిని గమనించి హెచ్చరికలు చేసినప్పటికీ, రోడ్డుపై వాహనాల పార్కింగ్ మాత్రం కొనసాగుతుండటం ప్రశ్నార్థకంగా మారింది.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో రహదారిపై వాహనాల పార్కింగ్ మరింత ప్రమాదకరంగా మారుతోంది. మార్ట్‌కు వచ్చే వినియోగదారుల వాహనాల కోసం తగిన పార్కింగ్ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, రోడ్డుపైనే వాహనాలు నిలిపే పరిస్థితి కొనసాగడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రద్దీ సమయంలో అత్యవసర వాహనాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### లిఫ్ట్ ఏర్పాటుతో మరింత పెరగనున్న రద్దీ

విషాల్ మెగా మార్ట్ వద్ద కొత్తగా లిఫ్ట్ ఏర్పాటు కావడంతో రానున్న రోజుల్లో వినియోగదారుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అదే సమయంలో పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయకపోతే ప్రస్తుత సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

### ఇకనైనా శాశ్వత పరిష్కారం చూపాలి

పార్కింగ్ సమస్యను కేవలం హెచ్చరికలతో వదిలేయకుండా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి విషాల్ మార్ట్ పరిసరాల్లో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు స్పష్టమైన చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొనే పరిస్థితి కాకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రామగిరిలో నిఘా పటిష్టం.

**సీసీ కెమెరాలకు రూ.80 వేల విరాళం.**
**పాత కెమెరాల మరమ్మతులు..**
**అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాల ఏర్పాటు.**
**నేరాల నియంత్రణకు ప్రజల సహకారం..**
**పోలీసులకు కాంట్రాక్టర్ల అసోసియేషన్ అండ.**

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 8:**

నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. ఇందుకోసం ఎస్‌సీసీఎల్ ఆర్జీ-3 ఏరియా సివిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రూ.80 వేల విరాళాన్ని అందజేసింది. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఈ మొత్తాన్ని రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్‌కు అందజేశారు. అందిన నిధులతో పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేయకుండా ఉన్న పాత సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించేందుకు పోలీసులకు అవకాశం కలగనుంది. నేరాలు జరగకుండా ముందస్తు పర్యవేక్షణ చేయడంతోపాటు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనలు జరిగిన సమయంలో సీసీ కెమెరా దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడనున్నాయి. నిందితులను గుర్తించడం, కేసుల దర్యాప్తులో ఆధారాలను సేకరించడం, ఘటనలపై స్పష్టతకు రావడంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో దోహదపడనున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుకు కాంట్రాక్టర్ల అసోసియేషన్ అందించిన సహకారాన్ని పోలీసులు అభినందించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు, ప్రజలు, వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేస్తే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.




# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక

**అన్ని జంక్షన్లను అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**వన్‌వే, టూ-వే విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలను పరిశీలించాలి.**
**ట్రాఫిక్ డైవర్షన్‌తో పాటు రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలి.**



**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 8:**

పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేసి, ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ట్రాఫిక్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించి, రద్దీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ఒకదారి, రెండుదారుల విధానాలను పరిశీలించి నిబంధనల ప్రకారం ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. మార్పులను కనీసం వారం రోజులపాటు పరిశీలించి, రాకపోకలపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసిన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను రూపొందించి నిబంధనల ప్రకారం అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు, మున్సిపల్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అవసరమైన మార్పులు, మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర పశువులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువులను రోడ్లపైకి తీసుకురాకుండా స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణకు రూపొందించే ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి అమలు వల్ల వచ్చే ఫలితాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి.

**హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి ఆర సుధారాణి.**
**అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు.**

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 8:**

బాలికలు తమ హక్కులు, రక్షణకు ఉన్న చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని మంథని ప్రథమ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర సుధారాణి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంథని న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణ, ఉచిత న్యాయ సేవలు, తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని జడ్జి సూచించారు. తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, న్యాయపరమైన రక్షణ మార్గాలపై విద్యార్థులకు వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి పీ. మంజుల, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్, న్యాయవాదులు శశిబూషణ్ కాచే, మంథని శ్రీనివాస్, ఎండీ. షబానా, అశోక్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**భద్రత, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి : అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు.**
**ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల భద్రతకు పటిష్ట చర్యలు.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 8:**



తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, పోలీసు సిబ్బంది, హోంగార్డులను బందోబస్తుకు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసే భద్రతా గదిలో భద్రపరిచి, నిర్ణీత విధానం ప్రకారం పరీక్షా కేంద్రాలకు తరలించాలని, పరీక్షల అనంతరం జవాబు పత్రాలను సురక్షితంగా పోస్టల్ శాఖకు అప్పగించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రథమ చికిత్స, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల, బాలుర పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ సిద్ధాంత పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 17 వరకు, ఇంటర్మీడియట్ ప్రాయోగిక పరీక్షలు అక్టోబర్ 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, జిల్లా పదో తరగతి పరీక్షల అధికారి రాంరెడ్డి, విద్య, పోలీసు, వైద్య, మున్సిపల్, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దినపత్రిక జనం వాయిస్
PRGI NO:TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు

**75 రోజుల శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందనలు.**
**క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 8:**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ప్రముఖ గ్రాన్యూల్ ఫార్మా ఇండియా లిమిటెడ్ సంస్థలో 75 రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరనుండటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఉద్యోగాల్లో చేరనున్న విద్యార్థులను గురువారం కలెక్టర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి లభించిన ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన, సంబంధిత అధికారులు, శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.



# డిజిటల్ సాంకేతికతను తరగతి బోధనతో అనుసంధానం చేయాలి

**ఖాన్ అకాడమీ వనరులను సమర్థవంతంగా వినియోగించాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**విద్యార్థుల అభ్యసన పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 8:**



డిజిటల్ సాంకేతికతను తరగతి గది బోధనతో అనుసంధానం చేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలోని అంశాలను ఉపాధ్యాయులు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఖాన్ అకాడమీ అందించే డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థి నిర్దేశిత అభ్యసన ఫలితాలను సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు గుర్తించి, వారి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. డిజిటల్ సాధనాలను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వినియోగించి గణిత నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ డా. పి.ఎం. షేక్, విద్యాశాఖ అధికారులు, 14 మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మహిళలపై దాడి యత్నాన్ని ఖండిస్తూ ఎన్ఎస్‌యూఐ నిరసన

***బీజేపీ తీరుపై సాదుల పవన్‌కుమార్ ఆగ్రహం.***
***మహిళా కార్యకర్తలపై దాడిని ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్న కాంగ్రెస్ నేతలు.***

**జనం వాయిస్, సిద్దిపేట, అక్టోబర్ 8:**



మహిళా ఎన్ఎస్‌యూఐ నాయకులపై బీజేపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారని ఆరోపిస్తూ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు సిద్దిపేటలో నిరసన చేపట్టాయి. గురువారం సిద్దిపేట బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ రాచకొండ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. మహిళా నాయకులపై దాడికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్‌కుమార్ మాట్లాడుతూ మహిళా కార్యకర్తలపై దాడికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఒకవైపు 'బేటీ బచావో.. బేటీ పడావో' అంటూ నినాదాలు చేస్తున్న బీజేపీ.. మరోవైపు మహిళా కార్యకర్తలపై దాడులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. మహిళలపై దాడికి ప్రయత్నించిన ఘటనను కేవలం రాజకీయ వివాదంగా చూడకుండా, మహిళా సమాజంపై జరిగిన దాడిగా పరిగణించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా కార్యకర్తలపై దాడులకు పాల్పడే ప్రయత్నాలను సహించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్సా వంశీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సనా, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రజినీ, ఎన్ఎస్‌యూఐ నాయకుడు సుధీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కరుణాకర్, రాజిరెడ్డి, చిన్న అజ్మత్, బైరి చింటూ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేయాలి

**టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే పరీక్షలు చేయాలి : అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు.**
**80 టీబీ ముక్త్ గ్రామాలకు సర్టిఫికెట్ల పంపిణీ.**



**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 8:**





జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య, ఆరోగ్య శాఖలతో పాటు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యం, మందులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపాలని సూచించారు. జిల్లాలో 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ అన్నారు. టీబీపై ఉన్న అపోహలను తొలగిస్తూ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి కె.వి. సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాజగోపాల్, వైద్య సిబ్బంది, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, టీబీ రహిత గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్టేట్ అధికారి ఐలయ్యపై విచారణ చేపట్టాలి

- **అధికార పార్టీ నాయకుడి అండతో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణ.**
- **సింగరేణి ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి.**
- **ఆధారాలను జీఎం, విజిలెన్స్, డైరెక్టర్ పా, సీఎండీకి పంపిస్తున్నాం.**
- **బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్.**

**జనం వాయిస్, రామగిరి, అక్టోబర్ 8:**



సింగరేణి సంస్థ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్న వ్యవహారాలపై అర్జీ-3 ఎస్టేట్ అధికారి ఐలయ్యపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం సెంటినరీకాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక అధికార పార్టీ నాయకుడి అండతో ఎస్టేట్ అధికారి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారంటూ రవీందర్ ఆరోపించారు. సింగరేణి సంస్థకు చెందిన భూములు కబ్జాలకు గురవుతున్న సమయంలో వాటిని పరిరక్షించాల్సిన అధికారి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి జీఎం మద్దతుగా నిలవడం సరికాదన్నారు. పాత పీనల్ రెంట్ రసీదులను అడ్డం పెట్టుకుని కొట్టగు టేలాలు వేయిస్తున్నారంటూ ఆరోపించిన ఆయన, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. తమ వద్ద ఉన్న ఆధారాలను జీఎం, విజిలెన్స్ విభాగంతో పాటు డైరెక్టర్ పా, సీఎండీకి ఈ-మెయిల్ ద్వారా పంపిస్తున్నామని చెప్పారు. ఐలయ్య ఎస్టేట్ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్థ భూముల్లో ఎన్ని కొత్త నిర్మాణాలు జరిగాయి, ఎన్ని టేలాలు వేశారు, వకీల్‌పల్లి చర్చి పక్కన ఉన్న భూమి కబ్జాకు కారకులు ఎవరు అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని రవీందర్ డిమాండ్ చేశారు. పాత పీనల్ రెంట్ రసీదులను ఎవరికి బదలాయించారు అనే అంశంపైనా అధికారులు దృష్టి సారించాలని కోరారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఎం మధుసూదన్ ఎస్టేట్ అధికారి ఐలయ్యకు మద్దతుగా వ్యవహరించకుండా సంస్థ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, నాయకులు దామెర శ్రీనివాస్, బొంకూరి పోశం, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 40వ స్టోర్ ప్రారంభం

- **దసరా, దీపావళికి సరసమైన ధరల్లో వైవిధ్యభరిత వస్త్రాలు.**
- **సినీనటి వైష్ణవి చైతన్య చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం.**

**జనం వాయిస్, బాచుపల్లి, అక్టోబర్ 8:**








బాచుపల్లి--మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 40వ స్టోర్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ సినీనటి వైష్ణవి చైతన్య జ్యోతి వెలిగించి, రిబ్బన్ కత్తిరించి నూతన స్టోర్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దఎత్తున షాపింగ్‌ప్రియులు హాజరై నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. దసరా, దీపావళి పర్వదినాలతో పాటు వివాహాది శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వయసుల వారికి అనువైన వైవిధ్యభరిత వస్త్రాలను ఒకేచోట అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళల కోసం కంచి పట్టుచీరలు, ఫ్యాన్సీ చీరలు, వివిధ ప్రాంతాల నైపుణ్య నేతకారులు రూపొందించిన ప్రత్యేక వస్త్రాలు, పెళ్లికుమార్తెల కోసం సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పురుషుల కోసం ఆధునిక నమూనాల కుర్తాలు, సంప్రదాయ దుస్తులు, అధికారిక దుస్తులు, రోజువారీ వినియోగ వస్త్రాలు, చిన్నారుల కోసం పండుగలను ప్రతిబింబించే ఆకర్షణీయమైన వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సినీనటి వైష్ణవి చైతన్య మాట్లాడుతూ బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నూతన స్టోర్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దసరా, దీపావళి సందర్భంగా కుటుంబంలోని ప్రతి ఒక్కరి అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు అందుబాటులో ఉండటం ప్రత్యేకత అన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఛైర్‌పర్సన్, పూర్తికాలపు డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హైదరాబాద్ విశ్వనగరంగా విస్తరిస్తున్న తరుణంలో బాచుపల్లిలో 40వ స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా, గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలోని కుటుంబాల పండుగలు, వివాహ వేడుకల అవసరాలకు అనుగుణంగా వస్త్రాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ శీర్ణ రాజమౌళి మాట్లాడుతూ దసరా, దీపావళి, వివాహ వేడుకల సందర్భంగా కుటుంబ సభ్యులందరి అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలను సౌకర్యవంతమైన వాతావరణంలో అందించడమే తమ లక్ష్యమన్నారు. పూర్తికాలపు డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ సంప్రదాయ పట్టుచీరల నుంచి పండుగ చీరలు, రోజువారీ వినియోగ వస్త్రాల వరకు కుటుంబంలోని అన్ని తరాల వారిని ఆకట్టుకునే విస్తృత శ్రేణి వస్త్రాలు నూతన స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకోవాలని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాల షాపింగ్‌ప్రియులను కోరింది.

# గోదావరిఖనికి ఈ నెల 14న కేటీఆర్

**జీఎం కాలనీ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమం**

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 8:**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.టి. రామారావు (కేటీఆర్) ఈ నెల 14న గోదావరిఖనికి రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తెలిపారు. గోదావరిఖనిలోని జీఎం కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి కేటీఆర్ హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నట్లు హరీష్ రెడ్డి తెలిపారు. కేటీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ శ్రేణులు సమన్వయంతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

# కేంద్రానికి వ్యతిరేకంగా మందమర్రిలో కాంగ్రెస్ భారీ ధర్నా

**ఓట్ల తొలగింపులో అవకతవకలపై సీఈసీ రాజీనామాకు డిమాండ్**

**జనం వాయిస్, మందమర్రి, అక్టోబర్ 8:**

కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఓట్ల తొలగింపు ప్రక్రియలో అవకతవకలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో భారీ ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఫ్లైఓవర్ కింద నిరసన చేపట్టారు. ఓట్ల తొలగింపులో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ( సి ఈ సి) రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నూరు నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నేతలు, యువజన, మహిళా, మైనారిటీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



PRGI NO:TGTEL/26/A0383
దైనిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్**

**మహబూబాబాద్, అక్టోబర్ 8 (జనం వాయిస్):**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో ఈనెల 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఓపెన్ 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అధ్యక్షతన సంబందిత శాఖల అధికారులతో సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పదో తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు 2 చీఫ్ సూపరిడెంట్స్, 2 డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్స్ 10 మందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా,పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలింపు భద్రంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలాని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి, మాల్ ప్రాక్టీసులను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్, తగిన మందులతో ఆశాలను,ఎ.యన్.యంలను అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకులు రాజేష్, ఇంచార్జ్ డి.ఈ.ఓ మందుల శ్రీరాములు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల ఆకలికి చెక్..
# పౌష్టికాహార కార్యక్రమం ప్రారంభం

**జనం వాయిస్, మందమర్రి, అక్టోబర్ 8:**





పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆకలి బాధను తీర్చడంతో పాటు ఆరోగ్యకరమైన విద్యకు బాటలు వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని శంకరపల్లి గ్రామంలో గురువారం ప్రారంభించారు. మందమర్రి మండలంలోని శంకరపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ పెరుమండ్ల వెంకటేష్, ఉపాధ్యాయులు మద్ది లక్ష్మణ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఖాళీ కడుపుతో చదువుపై దృష్టి సారించలేరని, కడుపునిండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటూ చదువులో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుని ఉన్నత చదువులు అభ్యసించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య సదస్సు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు, పౌష్టికాహారం లోపంతో కలిగే శారీరక, మానసిక సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా పూర్తి చేయాలి

- సన్న రకానికి రూ.2,461.. కామన్ రకానికి రూ.2,441 మద్దతు ధర.
- 7 రకాల సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్.
- జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్.

**మహబూబాబాద్ , అక్టోబర్ 8 (జనం వాయిస్):**

వానకాలం (ఖరీఫ్) 2026-27 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో మద్దతు ధర (ఎంఎస్పి) వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో పిపిసి ఇన్‌ఛార్జులు, సిబ్బందికి, సంబంధిత శాఖల అధికారులకు సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం కొనుగోళ్లు జరపాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి చెల్లింపులు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ అయ్యేలా ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రేడ్-ఏ (సన్న రకం) క్వింటాలుకు 2,461రూపాయలు కామన్ రకం క్వింటాలుకు 2,441 రూపాయలు, అదేవిధంగా ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్న ధాన్యం రకాలకు క్వింటాలుకు 500 రూపాయలు అదనపు బోనస్ చెల్లిస్తారన్నారు. బోనస్‌కు అర్హత పొందే 7 సన్న ధాన్యం రకాలలో బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్ సెగ్మెంట్, కెఎన్ఎం 1638, డబ్ల్యూజిఎల్ 44, కెఎన్ఎం 7715 గా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నమోదు, నాణ్యతా పరిశీలన, తూకం వివరాలు, రవాణా చలానాల నిర్వహణ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు రూపొందించిన పీసీఎస్‌ఎపి యాప్ ట్యాబ్ ఎంట్రీలపై పిపిసి ఇన్‌ఛార్జులకు, డిజిటల్ అసిస్టెంట్లకు సాంకేతిక నిపుణుల ద్వారా ప్రత్యక్షంగా డిజిటల్ శిక్షణ ఇచ్చారు.

**కొనుగోలు కేంద్రాల (పీపీసీ) వద్ద వసతులు, నాణ్యత రక్షణ**

ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద తేమ కొలిచే యంత్రాలు, క్లీనర్లు, ప్యాడీ డ్రాయర్లు, తార్పాలిన్ కవర్లు, సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతం 17శాతం కంటే ఎక్కువ లేకుండా ఆరబెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తూకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా లీగల్ మెట్రాలజీ అధికారుల ధృవీకరణ పొందిన కాంటాలను మాత్రమే వినియోగించాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత మిల్లులకు రవాణా చేసేలా వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వానకాలం (ఖరీఫ్) 2026-27 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలోని



రైతులకు ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర (ఎంఎస్పి) బోనస్ వివరాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఎం.ఎస్.డి (ఎంఎస్డి - మినిమం సపోర్ట్ ప్రైస్, గ్రాయిన్ ప్రొకర్మెంట్) గోడ పోస్టర్‌ను జిల్లా అధికారులు ఆవిష్కరించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు, సన్న బియ్యం బోనస్ వివరాలు మరియు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే వసతుల గురించి రైతులకు స్పష్టమైన సమాచారం చేరవేయడమే ఈ పోస్టర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ శిక్షణా సమావేశ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నరసింహారావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఇతర జిల్లా అధికారులు డి.ఆర్.డి.ఎ ఎ.పి.ఎం.లు, ప్యాక్స్ సి.ఈ.ఓలు, సంబంధిత సిబ్బంది, పిపిసి ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటితో పేద కుటుంబానికి భరోసా..
## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 8:**

సొంతింటి కల నెరవేరడంతో పేద కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. శాయంపేట మండలం మంధారిపేటలో లబ్ధిదారు వల్లపు శోభ-దిలీప్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# కల్పన కుటుంబాన్ని ఓదార్చిన కీర్తి రెడ్డి.

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 8:**

శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో ఇటీవల మృతిచెందిన నాతి కల్పన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి గురువారం పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంగుల రమణారెడ్డి, గిద్దమారి సురేష్, వనం దేవరాజ్, కొడపాక సంజీవరావు, మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# మై భారత్ వాలంటీర్ సందీప్‌కు ప్రశంసా పత్రం

**టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనలో విశేష సేవలు.**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా సన్మానం.**

**స్టేట్ యూత్ అంబాసిడర్‌గా సందీప్ సేవలకు గుర్తింపు.**

**జనం వాయిస్, పాలకుర్తి, అక్టోబర్ 8:**

టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనకు విశేష కృషి చేసిన మై భారత్ వాలంటీర్ ఎలమకంటి సందీప్‌ను జనగామ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ సందీప్ కుమార్ ఝా అభినందించి ప్రశంసా పత్రంతో సత్కరించారు. జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాలకుర్తి, దేవరుప్పుల బ్లాక్‌ల మై భారత్ వాలంటీర్‌గా సందీప్ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ సన్మానం చేశారు. మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఢిల్లీలో నిర్వహించిన టీబీ సంబంధిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు, తెలంగాణలో టీబీ నిర్మూలన కోసం స్టేట్ యూత్ అంబాసిడర్‌గా ఆయన చేస్తున్న సేవలను కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎలమకంటి సందీప్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వామ్యం అయ్యే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ టీబీ నిర్మూలనతో పాటు యువత భాగస్వామ్యం, సమాజ సేవ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పనిచేస్తానని పేర్కొన్నారు.




# టీపీటీఎఫ్ పాలకుర్తి మండల నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా డి.వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట నరసయ్య**

**పాలకుర్తి, జనం వాయిస్ అక్టోబర్ 8:**

టీపీటీఎఫ్ పాలకుర్తి మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు,ఎన్నికల అధికారి ఇమ్మడి అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల శాఖ గత ఏడాది కార్యకలాపాల నివేదికను ప్రధాన కార్యదర్శి పి. వెంకట నరసయ్య ప్రవేశపెట్టారు. అనంతరం పలు సమస్యలపై తీర్మానాలు ఆమోదించారు. ఎన్నికల అధికారి ఇమ్మడి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన కమిటీ:అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి పి.వెంకట నరసయ్య,ఉపాధ్యక్షులు ఏ. దయాకర్ రెడ్డి, బి.బాలాజీ, సీహెచ్. వెంకటయ్య, కార్యదర్శులు ఎస్. బుచ్చయ్య, ఎం.డి. షాహి సుల్తానా, ఎం.డి. యాకూబ్ పాషా,జిల్లా కౌన్సిలర్లు ఎస్. శేషగిరిరావు,ఏ.శ్రీనివాసులు ,ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి. రమేష్,అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా బి.అంజయ్య, జీవో కమిటీ కన్వీనర్‌గా పి. రమేష్ ఎన్నికయ్యారు.





# క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం

**జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్.**

**మహబూబాబాద్, అక్టోబర్ 8 (జనం వాయిస్) :**

క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యమని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్ అన్నారు. టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలో ని కాన్ఫరెన్స్ హాలులో అన్ని మండలాల ఎంపీడీవోలతో కలిసి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డ ఆవిష్కరించిన జోష్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి టీబి కి అన్ని రకాల పరీక్షలు చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా లభిస్తుందని తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల ప్రభుత్వం రూ.1000 పోషక ఆహార నిమిత్తం అందిస్తుందని, ప్రతి ఒక్కరు టీబి పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు అవగాహనతోనే టీబి అంతం చేయవచ్చని టిబి అంతం చేయడం కొరకు అందరు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా టీబి రహిత గ్రామపంచాయతీలు గా ఎంపికైన 13 మంది సర్పంచులను సన్మానించడం జరిగింది . జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలను టీబి రహిత గ్రామపంచాయతీగా తీర్చడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్పంచులు టీబి ముఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



# గూడూరు లో సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి

**అక్టోబర్ 8 జనం వాయిస్ పాలకుర్తి:**

పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో భూక్య వీరు నూతనంగా ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ ను, ఆ గ్రామ సర్పంచ్ తో కలసి ప్రారంభించిన, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ,,(టిపిసిసి) ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ఆమె మాట్లాడుతూ. గ్రామంలోని ప్రజలకు మంచి సేవలు అందించడానికి ముందుకు వచ్చిన షాపు యజమాన్యాని అభినందించారు. వారి వెంట, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్, ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, సర్పంచ్ మాచర్ల స్వరూప పుల్లయ్య, ఉప సర్పంచ్ కల్యాణ్, వార్డు మెంబర్లు విజయలక్ష్మి, పొన్నం మౌనిక, సునీత, నవిత, స్వప్న, నాగమణి, ప్రేమ్, రవి, గూడూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు లొంక ఐలయ్య, మాజీ ఎంపిటిసి బెల్లి దేవేందర్, మాజీ సర్పంచ్లు ఉప సర్పంచ్ లు , గ్రామ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



PRGI NO:TGTEL/26/A0383
దైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# టీబీ నిర్మూలనలో శాయంపేటకు గుర్తింపు

## తొమ్మిది గ్రామాలకు ఉత్తమ టీబీ రహిత గ్రామాల అవార్డులు

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 8:**

టీబీ నిర్మూలనలో శాయంపేట మండలానికి గుర్తింపు లభించింది. మండలంలోని నూర్జహాన్‌పల్లి, అప్పయ్యపల్లి, ఆరేపల్లి, గంగిరేణిగూడెం, కొత్తగట్టు సింగారం, మైలారం, హుస్సేన్‌పల్లి, నర్సింహులపల్లి, జోగంపల్లి గ్రామాలు ఉత్తమ టీబీ రహిత గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఈ మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీఎంహెచ్‌వో ఏ.అప్పయ్య చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. నూర్జహాన్‌పల్లి సర్పంచ్ అల్లే రాజీరు అవార్డు అందుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. టీబీ కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించడంలో వైద్య సిబ్బంది చేసిన కృషి ఫలితంగానే ఈ గుర్తింపు దక్కింది. శాయంపేట వైద్యాధికారి డాక్టర్ ఎన్.సాయికృష్ణ, వైద్య సిబ్బందిని మండల ప్రజలు అభినందించారు.



# కాంట్రాక్టు కార్మికులకు రూ.25 వేల లాభాల వాటా చెల్లించాలి

- కనీస వేతనాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం.
- పని ప్రదేశాల్లో భద్రతా పరికరాలు అందించాలి.
- ఏఐటీయూసీ నాయకుడు ఎం.ఎ. గౌస్ డిమాండ్.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 8:**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ లాభాల్లో వాటా కింద రూ.25 వేల చొప్పున చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ-1 అధ్యక్షుడు ఎం.ఎ. గౌస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-1 సీహెచ్‌పీలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత 20 ఏళ్లుగా దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తూ బొగ్గు ఉత్పత్తికి తమ వంతు సహకారం అందిస్తున్నారని గౌస్ తెలిపారు. సంస్థ లాభాల్లో వారి శ్రమ కూడా కీలకంగా ఉందన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైన అనంతరం 2024లో సంస్థ లాభాల నుంచి రూ.5 వేలు, 2025లో రూ.5,500 చొప్పున కాంట్రాక్టు కార్మికులకు ఇప్పించామని తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి లాభాలు వచ్చే అవకాశం ఉన్నందున, అందులో నుంచి కాంట్రాక్టు కార్మికులకు రూ.25 వేల చొప్పున లాభాల వాటా అందించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలను పోషించుకోవడంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కనీస వేతనాలు అమలు చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని గౌస్ ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల సవరణ చైర్మన్ జనక్ ప్రసాద్ కూడా కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టు కార్మికులు శాశ్వత కార్మికులతో సమానమైన పనులు చేస్తున్నప్పటికీ తక్కువ వేతనాలు పొందుతున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, కనీస వేతనాల సవరణ చైర్మన్ స్పందించి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### భద్రతా పరికరాలు అందించాలి

కాంట్రాక్టు కార్మికులకు పని ప్రదేశాల్లో అవసరమైన భద్రతా పరికరాలు అందించకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని గౌస్ ఆరోపించారు. యాజమాన్యం వెంటనే స్పందించి ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి అవసరమైన భద్రతా సామగ్రిని అందించాలని కోరారు. ఈ సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు వెంకన్న, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జనం వాయిస్, సికింద్రాబాద్, అక్టోబర్ 8:**

తెలంగాణలో 15 ఏళ్లుగా సేవలందిస్తున్న సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్లు, నర్సులు, టెక్నికల్ సిబ్బంది తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నప్పటికీ తెలంగాణలో ఇప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 13న కలెక్టరేట్ల ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టనున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



# పాలకుర్తిలో సర్వసభ సమావేశం. అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష

- తక్కువ వర్షపాతంతో ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి.
- విద్యుత్ విద్య ఆరోగ్యం శిశు సంక్షేమ పశు సంక్షేమ తదితర శాఖల సమస్యలపై చర్చ.

**పాలకుర్తి అక్టోబర్ 8 జనం వాయిస్:**

పాలకుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం ఎంపీడీవో వేదవతి స్పెషల్ ఆఫీసర్ మాధవి లత ఎమ్మార్వో సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి జనగామ జిల్లా జెడ్పీ సీఈవో బలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు విద్యుత్ శాఖ ఏఈ హౌసింగ్ శాఖ ఏఈలు శిశు సంక్షేమ విద్య వ్యవసాయ ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు అందుతున్న సేవలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతులు ప్రజల సమస్యలు అభివృద్ధి



పనుల పురోగతిపై సర్వసభలో విస్తృతంగా చర్చించారు.

**తక్కువ వర్షపాతంతో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం**

మండలంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక చేసుకోవాలని వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు.

**విద్యుత్ సమస్యలపై చర్చ**

గ్రామాల్లో విద్యుత్ సరఫరా తక్కువ వోల్టేజ్ సమస్యలు విద్యుత్ స్తంభాల పరిస్థితిపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. కొన్ని ప్రాంతాల్లో లూజ్‌గా ఉన్న విద్యుత్ తీగలు దెబ్బతిన్న స్తంభాలు విద్యుత్ మౌలిక వసతుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**విద్య ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. ఆరోగ్య శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య సమస్యలు వైద్య సేవలు సీజనల్ వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలను వివరించారు. అలాగే శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులు గర్భిణులు బాలింతలకు అందుతున్న సేవలపై అధికారులు వివరాలు వెల్లడించారు. హౌసింగ్ శాఖ అధికారులు గృహ నిర్మాణ పనుల పురోగతిని సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అధికారులు పేర్కొన్నారు.

# ఎర్రజెండా స్ఫూర్తిగా నిలిచిన కొంపెల్లి వీరయ్య

- ప్రజా ఉద్యమాల కోసం అవిశ్రాంతంగా పోరాడిన వీరయ్య సేవలు చిరస్మరణీయం.
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య.

**కురవి, అక్టోబర్ 8 (జనం వాయిస్):**

మండలంలోని తట్టుపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ కొంపెల్లి వీరయ్య సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. నక్క సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జి. నాగయ్య మాట్లాడుతూ.. కామ్రేడ్ కొంపెల్లి వీరయ్య కూలీలు, రైతుల హక్కుల కోసం జీవితాంతం అనేక పోరాటాలు చేసిన నాయకుడని గుర్తుచేశారు. 1988 నుంచి తుదిశ్వాస వరకు తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతానికి, ఎర్రజెండాకు కట్టుబడి ప్రజల కోసం పనిచేశారని అన్నారు. సంతానం లేకపోయినా పార్టీనే తన కుటుంబంగా భావించి, తన ఇంటినే పార్టీ కార్యాలయంగా మార్చుకున్నారని తెలిపారు. పార్టీ ఉద్యమాల సందర్భంగా పలుమార్లు నిర్బంధానికి గురై, కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడిపినా వెనుకడుగు వేయలేదన్నారు.




ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి ప్రతి ఒక్కరికీ అండగా నిలిచిన నాయకుడిని పార్టీ కోల్పోయిందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస మాట్లాడుతూ.. రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీలు మారుతున్న పరిస్థితుల్లోనూ కామ్రేడ్ వీరయ్య సుమారు నాలుగు దశాబ్దాల పాటు తాను నమ్మిన ఎర్రజెండా పార్టీలోనే కొనసాగారని అన్నారు. నేటితరం నాయకులు, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. భూస్వామ్య శక్తుల నుంచి పార్టీని కాపాడటంలో గ్రామస్థాయిలో అనేక పోరాటాల్లో వీరయ్య కీలకంగా పాల్గొన్నారని తెలిపారు. సభ అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు అమరవీరుల విప్లవ గీతాలు ఆలపించారు. ఈ సంస్మరణ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య, ఆకుల రాజు, మండల కార్యదర్శి పిట్టల వెంకన్న, నాయకులు కడియం సత్యం, సీపీఎం సీనియర్ నాయకులు నక్క ఉప్పలయ్య, కొల్లూరు సత్యం, మాలోత్ కిషన్ నాయక్, జంగం ఉప్పలయ్య, స్వాతంత్ర్య సమరయోధురాలు బొమ్మన సుశీల, మల్లయ్య, భిక్షం, వెంకన్న, వీరయ్య సతీమణి కొంపెల్లి ఉప్పలమ్మతో పాటు నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 177 హద్దు రాళ్లకై వెతుకులాట.!?

- కురవిలో ప్రభుత్వ భూమి రక్షణకు అడుగడుగునా ఆటంకాలు.
- గురువారం కూడా కొలతలు వాయిదా.
- 177 లెక్క తేల్చేదెప్పుడు..?

**కురవి, అక్టోబర్ 8 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 177 ప్రభుత్వ భూమి చుట్టూ సాగుతున్న హైడ్రామా అంతా ఇంతా కాదు. ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని బాధ్యత గల పౌరులు కోరుతుంటే, అధికారులు మాత్రం కొర్రీల మీద కొర్రీలు పెడుతూ కాలయాపన చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలన్నీ క్షేత్రస్థాయిలో నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. గురువారం నాడు జరగాల్సిన సర్వే కూడా వాయిదా పడటంతో, అసలు అధికారులకు ప్రభుత్వ భూమిని రక్షించాలనే చిత్తశుద్ధి ఉందా? లేదా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**177 ప్రభుత్వ భూమి హద్దులు ఎక్కడ.. అధికారులకే అంతుచిక్కదా?**

సర్వే నంబర్ 177 లో ఉన్న ప్రభుత్వ భూమి హద్దులు ఎక్కడున్నాయో తేల్చడం అధికారుల వల్ల కావడం లేదు.


జనం వాయిస్
epaper.janamvoice.com | Date: 08 Oct, 2026 | Page: 6

177 ప్రభుత్వ భూమి సర్వేకు 172 లింకేంటి..?

- అధికారుల నోటీసులపై ఫిర్యాదుదారుల తీవ్ర అభ్యంతరం.
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారా?
- తప్పుడు సర్వే చేయాలని చూస్తున్న జిల్లా సర్వేయర్ పై కోర్టుకు వెళ్తాం.
- మాతక్కి సాంబశివరావు, ఐరుగు వెంకన్న

కురవి, అక్టోబర్ 7 (జనం వాయిస్):

172ను లింక్ చేయడం వెనుక అంతర్యమేంటి?

మళ్లీ నోటీసులు.. మళ్లీ వివాదం...

లేకుంటే కోర్టు బాట...

epaper.janamvoice.com | 08 Oct, 2026 | Page: 6 | Clip ID: C-427160
For more details, visit epaper.janamvoice.com

విచిత్రం ఏంటంటే, ఈ భూమి లెక్క తేలాలంటే పాత హద్దురాయి దొరకాలని, పక్కనే ఉన్న చెరువు హద్దులు దొరికితేనే 177 తుది లెక్కలు తేలుతాయని అధికారులు సరికొత్త కుంటిసాకులు వెతుకుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, జీపీఎస్ వ్యవస్థలు అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో కూడా.. ఇంకా పాత హద్దురాళ్ల కోసం వెతుకులాట పేరుతో కాలక్షేపం చేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.

**177 భూమి కొలతలకు హద్దులే అడ్డంకా.. ఇదేం సర్వే!**

చెరువు హద్దులు, పాత హద్దురాయి పేరుతో గురువారం నాడు జరగాల్సిన సర్వేను కూడా అధికారులు మరోసారి వాయిదా వేశారు. సర్వేకు ముహూర్తం పెట్టడం, తీరా సమయానికి ఏదో ఒక సాకుతో వాయిదా వేయడం కురవిలో సర్వసాధారణంగా మారిపోయింది. హద్దులు నిర్ణయించడమే సర్వే ప్రాథమిక విధి కాగా.. హద్దులు లేవనే నెపంతోనే సర్వేను




ఆపేయడం 'ఇదేం సర్వే' అంటూ స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదంతా ఆక్రమణదారులకు సమయం ఇచ్చేందుకేనా అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**డిమాండ్ ఇదే.. జిల్లా అధికారులు స్పందించాలి!**

నోటీసుల జారీ దగ్గరి నుంచి హద్దురాళ్ల ఏర్పాటు వరకు అంతా గందరగోళంగా మార్చేశారు. ఈ కాలయాపనను ఆక్రమణదారులు తమకు అనుకూలంగా మార్చుకుని భూమిని మరింత కబ్జా చేసే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, తక్షణమే 177 ప్రభుత్వ భూమికి పక్కాగా శాశ్వత హద్దులు నిర్ణయించి, అక్కడ ప్రభుత్వ రక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని బాధ్యతగల పౌరులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇట్టి విషయంపై "జనం వాయిస్" ప్రతినిధి వివరణ కోసం జిల్లా సర్వేయర్ కు ఫోన్ చేయగా స్పందించలేదు.

# ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాయాలి

- నిష్పక్షపాత జర్నలిజమే సమాజానికి మేలు.
- మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.
- టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ.

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 8:**

జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలబడి నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ సూచించారు. గురువారం మంథని ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన ఆయనకు పాత్రికేయులు మర్యాదపూర్వకంగా స్వాగతం



పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ జర్నలిజం విలువలను కాపాడాలని అన్నారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. ప్రస్తుతం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి వాస్తవాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. వార్తల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంకరి ప్రకాష్, మంథని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జంజర్ల శంకర్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు బర్ల సంపత్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రమేష్, లక్కాకుల నాగరాజు, కంది కృష్ణారెడ్డి, గంధం ఆంజనేయులు, బాసాని సాగర్, మహిమూద్‌ఖాన్, రాజు, లక్ష్మణ్, కిరణ్, మూగ శ్రీకాంత్, పెరుగు రాకేష్, ప్రదీప్, తిరుమలేష్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPAL-LI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com